www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 23 సెప్టెంబరు 2024
5
పశ్చిమ గోదావరి

జిల్లాస్థాయి చెస్, క్యారమ్స్ పోటీలు ప్రారంభం

భీమవరం : యుటిఎఫ్ స్వర్ణోత్సవం సందర్భం భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయుల జిల్లాస్థాయి చెస్, క్యారమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపి మూర్తి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్ల అయిన సందర్భంగా ఉపాధ్యాయులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండల, పట్టణ స్థాయిలో పోటీలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. అక్కడ గెలుపొందిన వారు జిల్లాస్థాయిలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ పోటీలలో ఉపాధ్యాయులు మంచి ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. మిగిలిన పోటీలు వచ్చే ఆదివారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పివిఎస్.విజయ రామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శులు టిఇ.జయ కుమార్, పి.క్రాంతి కుమార్, కె.రామకృష్ణ ప్రసాద్, డి.యేసు బాబు, జి.రామకృష్ణ రాజు, ఎం.శ్రీనిబాబు, మండల నాయకులు పాల్గొన్నారు.

కాలుష్యం 'కాటు'..!

పరిశ్రమల కాలుష్యంతో పంట కాలువలన్నీ విషతుల్యంగా మారుతున్నాయి. గోస్తనీ నది, యనమదుర్రు డ్రెయిన్, కొల్లేరు వంటివి అందుకు ప్రత్యక్ష నిదర్శనాలుగా చెప్పొచ్చు. 2014-19 మధ్య జిల్లాలోని పరిశ్రమల కాలుష్యంపై టిడిపి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అనేక సమావేశాలు నిర్వహించి, యాక్షన్ ప్లాన్ను రూపొందించినా ముందుకు సాగలేదు. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని తాగునీటి వనరులన్నీ విషతుల్యంగా మారిపోతున్నాయి. జనం అనేక అనారోగ్య సమస్యలతో విలవిల్లాడుతున్నారు. పరిశ్రమల కాలుష్యం, తాగునీటి కాలుష్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి జిల్లా ప్రజలను రోగాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

- పరిశ్రమల వ్యర్థాలన్నీ పంట కాలువల్లోకే
- రెండు జిల్లాల్లోనూ పరిస్థితి అత్యంత దారుణం
- తణుకు-నుంచి భీమవరం మధ్యలో 21 పరిశ్రమల కాలుష్యం కాలువల్లోకి
- కలుషితమైన గోస్తనీ, యనమదుర్రు
- ఏలూరు, విజయవాడ పరిశ్రమల కాలుష్యమంతా కొల్లేరులోకి
- ఆక్వా పరిశ్రమల వ్యర్థాలన్నీ పంట కాలువల్లోకే
- విషతుల్యంగా తాగునీరు, భూగర్భ జలాలు

కాలుష్యంతో అధ్వానంగా మారిన యనమదుర్రు డ్రెయిన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తణుకు నుంచి భీమవరం మధ్యలో దాదాపు 21 పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలన్నీ గోస్తనీ, యనమదుర్రు డ్రెయిన్లో కలుస్తున్నాయని 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి తేల్చింది. దీంతో తాగునీటి వనరులన్నీ కలుషితమవుతున్నాయని తేల్చి అప్పట్లో టిడిపి ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ప్రకటించింది. పరిశ్రమలకు నోటీసులివ్వడం, తనిఖీలు చేయడం జరిగింది. అప్పట్లో కార్మిక శాఖామంత్రిగా ఉన్న పితాని సత్యనారాయణ వివిధ ప్రజాసంఘాలతోపాటు అనేక మందితో భీమవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతేకాకుండా భీమవరానికి ఆనుకుని, చుట్టుపక్కల ఉన్న 19 ఆక్వా ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలు సైతం పంట కాలువల్లోకి విడిచిపెడుతున్నట్లు తేలింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే తుందుర్రు ఆక్వాఫుడ్ పార్క్ ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. పదేళ్ల గడిచినా ఇప్పటికీ పరిశ్రమల నుంచి పంట కాలువల్లోకి విడుదలవుతున్న కాలుష్యంపై కనీస చర్యలు లేకుండాపోయాయి. 2019-24 మధ్య పాలన సాగించిన వైసిపి ప్రభుత్వం కాలుష్యంపై పట్టించుకున్న దాఖలాల్లేవు. జీవిఐ కాలంలో ఆక్వా మేత పరిశ్రమలతోపాటు ఆక్వాకు సంబంధించిన ఇతర యూనిట్లు పెరిగిపోయాయి. వాటి నుంచి వచ్చే వ్యర్థాలన్నీ పంట కాలువల్లోకే విడుదల చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది. దీంతో పంట కాలువల్లో కలుషితమైన నీటితోనే గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను నింపుతున్నారు. ఈ నీరు తాగేందుకు పనికి రావడం లేదు. పశువులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి చాలాచోట్ల నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా తాగునీటి వనరులతోపాటు పీల్చే గాలిసైతం విషంగా మారుతున్న పరిస్థితి ఉంది. దీంతో ప్రజలు క్యాన్సర్తోపాటు అనేక అంతుబట్టని రోగాల బారిన పడుతున్నారు. పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్న పరిస్థితి ఉంది. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో కాలుష్యంపై జిల్లా ప్రజానీకంలో మరోసారి చర్చ మొదలైంది. భీమవరం నడిబొడ్డున ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్ను చూస్తే కాలుష్యం ఎంత తీవ్రస్థాయికి చేరిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జిల్లాల విభజన తర్వాత భీమవరం జిల్లా కేంద్రంగా మారింది. జిల్లా కేంద్రం చుట్టూ కాలుష్యకాసారంగా ఉంది. పరిశ్రమల కాలుష్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, తాగునీటి వనరులను, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని అంతా కోరుతున్నారు.

కొల్లేరులోకీ పరిశ్రమల కాలుష్యం

ఏలూరు జిల్లాలో అభయారణ్యంగా పేరొందిన కొల్లేరు పూర్తిగా కాలుష్యకోరల్లో చిక్కుకుంది. విజయవాడ, ఏలూరు నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లోని పరిశ్రమల నుంచి వ్యర్థాలన్నీ కొల్లేరులోకే చేరుతున్నాయి. దీంతో 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు మొత్తం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చేపలు, రొయ్యల చెరువుల్లో వాడే వ్యర్థాలన్నీ కొల్లేరులోకే వదిలేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇతర ప్రాంతాల్లోని ఆక్వా పరిశ్రమలు, ఐస్ ఫ్యాక్టరీల పరిశ్రమల కాలుష్య వ్యర్థాలు సైతం చాలాచోట్ల పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. దీంతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. కొల్లేరులో మత్స్య సంపద అంతరించిపోతుంది. వలస పక్షుల రాక తగ్గిపోతుంది. జనం అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొనుగోలు చేసే తప్ప గుక్కెడు నీరు దొరకని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే పరిశ్రమల కాలుష్యంపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటించి ముందుకు సాగాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమల కాలుష్యం పంట కాలువల్లోకే వచ్చి పడుతున్నా ఆ శాఖాధికారులకు మాత్రం పట్టడం లేదు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కొంత హడావుడి చేసిన అధికారులు తర్వాత పట్టించుకున్న దాఖలాల్లేవు. జిల్లా ప్రజానీకం కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలుష్య నియంత్రణ శాఖ ఒకటి ఉందనే సంగతిసైతం జనం మరిచిపోయిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మండలి అధికారులను రంగంలోకి దింపి తగు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

జెసి రాహుల్ కుమార్ రెడ్డి

రైతులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని చినతాడేపల్లి, కృష్ణయ్యపాలెం, పడాల గ్రామాల్లో పర్యటించి సంబంధిత శాఖల అధికారులు, రైతులతో కలిసి వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పడాల అగ్రికల్చర్ మార్కెట్ యార్డును సందర్శించి తేమ శాతాన్ని లెక్కించే పరికరాలను తనిఖీ చేసి వాటి పనితీరును పరిశీలించారు. మిషన్లు పాడైతే సరి చేయించి ఇంకా కావాల్సినవి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారం రోజులు ముందుగా మిల్లర్ల నుండి గన్నీ బ్యాగులను సేకరించి సచివాలయాల్లో భద్రపరచాలని చెప్పారు. చిరిగిన గోనె సంచులు వేరు చేసి కుట్టించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లై డిఎం టి.శివరామ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి సరోజ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

25న ఆర్ఎస్ సంస్మరణ సభ

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా సిపిఎం నాయకుల్లో ప్రముఖులు, పూర్వ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్) సంస్మరణ సభ ఈ నెల 25వ తేదీన భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహిస్తున్నట్లు బి.బలరాం తెలిపారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్వి గోపాలన్, బి.వాసుదేవరావు కలిసి బలరాం ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఆర్ఎస్ సంస్మరణ సభకు వివిధ రాజకీయ పక్షాలు, సంస్థలు, సంఘాలు, నాయకులు, ప్రజాప్రతినిధులను, శాసన సభ్యులను ఆహ్వానిస్తున్నామన్నారు. అందరూ పాల్గొని ఆర్ఎస్కు నివాళులర్పించాలని సిపిఎం జిల్లా కమిటీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఆర్ఎస్ ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో, సిపిఎం ఏర్పడిన తరువాత జిల్లాలో ఉద్యమ నిర్మాణంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. తన యావజ్జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన యోధుడని అన్నారు. విద్యార్థి దశలో విద్యార్థి ఉద్యమ నాయకుడిగా పనిచేశారని గుర్తు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్ర కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా పనిచేయడం జరిగిందన్నారు. 1967-72లో నరసాపురం ఎంఎల్ఎగా పనిచేశారన్నారు. ఈ జిల్లా రైతు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. చించినాడలో మొదలైన ఆయన ఉద్యమ ప్రస్థానం చించినాడ గ్రామ సర్పంచిగా పంచాయతీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ఆర్ఎస్ ముఖ్య భూమిక పోషించారన్నారు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సంస్మరణ సభలో అందరూ పాల్గొని నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఎల్ఎ తీరుపై టిడిపి అధిష్టానం స్పందించాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి బాబు

కాళ్ల : నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దళిత సంఘం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఏలూరుపాడు ఘటనలో ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యలు కవ్వింపు చర్యల్లా ఉన్నాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, టిడిపి అధిష్టానం తక్షణం స్పందించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద నిరసనలకు దళిత సంఘాలు ఐక్యంగా ఇచ్చిన పిలుపులో భాగంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు పాల్గొని మాట్లాడారు. శాంతియుతమైన ఉండి నియోజకవర్గాన్ని సమస్యాత్మక నియోజకవర్గంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిలిచి మాట్లాడితే పరిష్కారమయ్యే చిన్న ఫ్లెక్సీ వివాదాన్ని స్వయంగా ఎంఎల్ఎ రాద్ధాంతం చేయడం దారుణమన్నారు. ఫ్లెక్సీ వివాదం కాస్తా మత ఘర్షణలకు తావిచ్చేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి సనాతన స్వదేశీ సేన ప్రతినిధిగా మాట్లాడుతున్నారని బహిరంగంగా ప్రజల మధ్య విభజనను తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ మత విశ్వాసాన్నైనా గౌరవించాలని అది రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ అని గుర్తుచేశారు. హిందువులను ముస్లిం, క్రైస్తవ వ్యతిరేకులుగా మార్చాలని ప్రయత్నించడం సమాజానికి హానికరమన్నారు. 'చేతులకు గాజులు తొడుక్కొని కూర్చొం' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎంఎల్ఎ చేయడం సబబుకాదన్నారు. నియోజకవర్గంలో కుల, మతాలకు ఘర్షణలకు తావిచ్చే వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తే చట్ట ప్రకారం ఎంఎల్పై చర్యలు తీసుకోవాలని కోరారు. మరో గరగపర్రు ఉద్యమంలా మార్చొద్దని స్పష్టం చేశారు. తక్షణం జిల్లా కలెక్టర్, ఎస్పి ఏలూరుపాడు గ్రామాన్ని సందర్శించి సమస్య జఠిలం కాకుండా శాంతి కమిటీ వేసి పరిష్కరించాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఎంఎల్ఎపై ఎస్సి, ఎస్టి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పెనుమంట్ర :కాళ్ల మండలం ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుపై ఎస్సి, ఎస్టి, అట్రాసిటీ దేశద్రోహం వంటి కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్సి, ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు, చవ్వాకుల భరత్ కుమార్, పొన్నమండ బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుల చేశారు. రఘురామకృష్ణంరాజు అసెంబ్లీలోకి అడుగుపెట్టడానికి కారణం అంబేద్కర్ ఆలోచనా పరులేనని తెలిపారు. ఉండి నియోజకవర్గంలో షెడ్యూల్ కులాల వారి ఓట్లతో గెలిచి, షెడ్యూల్ కులాల ఆరాధ్యదైవమైన అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడం రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల వారిని అవమానించడమేనని పేర్కొన్నారు. ఈ ఘటనపై గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, అసెంబ్లీ కార్యదర్శి, ఎస్సి, ఎస్టి, ప్రివిలేజ్ కమిటీ, జాతీయ ఎస్సి కమిషన్, రాష్ట్ర ఎస్సి కమిషన్ ఛైర్మన్కు వినతిపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు.

ఎంఎల్ఎవా.. రౌడీవా!

రఘురామకృష్ణంరాజుపై మాజీ ఎంపీ హర్షకుమార్ ఆగ్రహం

కాళ్ల : కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, ఎంఎల్ఎ అయ్యాననే అహంకారమో అర్థం కావడం లేదని ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజుపై అమలాపురం మాజీ ఎంపీ జివి హర్షకుమార్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఏలూరుపాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఫ్లెక్సీ వివాదాస్పదంగా మారిన సంఘటనా స్థలాన్ని హర్ష కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు నిర్మించారని గుర్తు చేశారు. ఒక కులాన్ని టార్గెట్ చేస్తూ ఎంఎల్ఎ మాట్లాడడం సరికాదన్నారు. ఎంఎల్ఎ ఒక రౌడీలా ప్రవర్తిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఎంఎల్ఎ బెదిరింపు మాటలు ఏంటని ప్రశ్నించారు. ఈ సంఘటనపై పోలీసులు వెంటనే స్పందించి ఎంఎల్ఎపై ఎస్సి, ఎస్టి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ఏలూరుపాడు గ్రామంలో అంబేద్కర్ ఫ్లెక్సీని ఎంఎల్ఎ రఘు రామకృష్ణంరాజు తొలగించడం పట్ల పలువురు దళిత నాయకులు ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. దళితుల మనోభావాలకు వ్యతిరేకంగా మాట్లాడిన ఉండి ఎంఎల్ఎపై రాజ్యాంగ బద్ధంగా చర్యలు తీసుకోవాలని పలువురు దళిత నాయకులు డిమాండ్ చేశారు.

ఎస్సి, ఎస్టి కేసులంటే తెలుసా

ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడు గ్రామంలో జరిగిన ఘటనపై ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఆదివారం మరోసారి స్పందించారు. తనపై ఎస్సి, ఎస్టి కేసులు పెట్టమంటున్న వారికి అసలు వాటి గురించి తెలుసా అని ప్రశ్నించారు. నేనేమీ గాజులు తొడుక్కుని కూర్చోలేదన్నారు. మీ దేవుడిని పూజించుకునేందుకు మీకు ఎంత హక్కు ఉందో, మా దేవుడిని పూజించుకునేందుకు తమకు అంతే హక్కు ఉందన్నారు. మీ ధర్మం తప్పని తాము అనట్లేదని, మా ధర్మం తప్పనడం సమంజసం కాదని తెలిపారు.

పేదలకు అండగా సీతారాం ఏచూరి

సంస్మరణ సభలో ఎస్ఎఫ్ఐ నేతల నివాళి

ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - పాలకొల్లు

సమాజంలో పేదలు, మధ్యతరగతి ప్రజలకు నిరంతరం అండదండగా కమ్యూనిస్టు ఉద్యమనేత, మానవతావాధి సీతారాం ఏచూరి నిలబడ్డారని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. పాలకొల్లు మహిళా సంఘం భవనంలో ఎస్ఎఫ్ఐ ఎక్సలెంట్ టీం ఆధ్వర్యంలో ఆదివారం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, జిల్లా సీనియర్ నాయకులు ఆర్ఎస్లకు ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ మాజీ అధ్యక్షులు డి.అజయ్ అధ్యక్షత వహించారు. ఎ.రవి మాట్లాడుతూ సీతారాం ఏచూరి జాతీయ, అంతర్జాతీయ పోరాటాలతో సిద్ధాంతకర్తగా కూడా పేరు గాంచారని, మతం రాజకీయాలతో ముడి పెట్టరాదని నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాన్ని ధారబోసారని చెప్పారు. విద్యార్థి దశ నుంచి పోరాట పటిమతో నిలబడ్డారన్నారు. ఈ మధ్యకాలంలో ఆర్ఎస్, వలవల శ్రీరామమూర్తి సత్తిరాజు, నరసాపురం నాయకులు రాములు మరణాలకు కూడా ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మాజీ నేతలు తొట్టెంపూడి కోటేశ్వరరావు, యర్ర అజయ్ కుమార్, చల్లా సోమేశ్వరరావు, టి.అప్పాజి, కె.కన్నబాబు, జె.సత్యనారాయణలు మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి జువ్వాది శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు.

మానవతావాది పిన్నమరాజు ప్రతాప్‌రాజు

ఎబిఎస్‌బికె ట్రస్ట్ ఛైర్మన్ బలరాం

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

సమసమాజం కోసం కాంక్షించిన గొప్ప మానవతావాది పిన్నమరాజు ప్రతాప్ రాజు అని ఎబిఎస్‌వికె ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం అన్నారు. విస్సాకోడేరు సచివాలయం వద్ద ప్రతాప్ రాజు 4వ వర్ధంతి అల్లూరి సీతారామ రాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విస్సాకోడేరు, మోగల్లు, గుత్తులవారి పాలెంలో వృద్ధులకు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం బలరాం మాట్లాడుతూ మిత్రులు ప్రతాప్ రాజు నిరంతరం సమాజాభివృద్ధికి తమవంతు కృషి చేశారని కొనియాడారు. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలను కొనసాగించేలా కుటుంబ సభ్యులు విశ్వజననీ ప్రతాప్ రాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతాప్ రాజు వర్ధంతి సందర్భంగా వృద్ధులకు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఇటీవల విజయవాడలో భారీవర్షాల కారణంగా ముంచెత్తిన వరదల్లో నష్టపోయిన బాధితులకు కూడా దుప్పట్లు అందించడం అభినందనీయమన్నారు. అల్లూరి, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో కూడా ప్రతాప్‌రాజును స్మరించుకుంటూ సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రాజు సోదరుడు చిన్నమరాజు పృద్వీరాజు, సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రీయ్య, నాయకులు దున్నా మరియమ్మ, గోపాలరాజు, ఖండవల్లి వెంకన్న, విశ్వజననీ ప్రతాప్‌రాజు, చారిటబుల్ ట్రస్టు సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుమారుడి అవయవదానం

ఆదర్శంగా నిలిచిన పోలిశెట్టి దంపతులు

మురహరి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - వీరవాసరం

తన కుమారుడు బతికే అవకాశం లేదని తెలిసీ తన కుమారుడును మరొకరి రూపంలో చూసుకోవచ్చునన్న ఆలోచనతో బ్రెయిన్ డెడ్ అయిన తన కుమారుడి అవయవాలను దానం చేసిన ఆదర్శమూర్తులు పోలిశెట్టి సుబ్రహ్మణ్యం దంపతులు. అవయవ దానం ఎంత అవసరమో తెలియచెప్పి భావితరాలకు ఆదర్శంగా నిలిచారు. వీరవాసరం మండలం తోకలపూడి గ్రామానికి చెందిన పోలిశెట్టి సుబ్రహ్మణ్యం, నాగపుష్పలు. వీరికి ఇద్దరు కుమారులు ప్రవీణ్, మురహరి. మురహరి విజయవాడలోని కెఎల్‌యు యూనివర్సిటీలో బిడిఎ చదువుతున్నాడు. ఒక పరీక్ష నిమిత్తం తన స్నేహితుడితో కలిసి ఈ నెల 21న విజయవాడ నుంచి విశాఖపట్నం బైక్‌పై వెళుతున్నారు. ఈక్రమంలో తుని సమీపంలో మురహరి నడుపుతున్న బైకును వెనుకనుంచి కారు ఢీకొట్టడంతో మురహరి వెనకాల కూర్చున్న స్నేహితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న మురహరిని తునిలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ మురహరిని పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. ఈ విషయం మురహరి తల్లితండ్రులకు చెప్పి మీ కుమారుడి అవయవాలు దానం చేస్తే బాగుంటుందని వైద్యులు చెప్పడంతో వారు అంగీకారం తెలిపారు. దీంతో మురహరి గుండె, కళ్లు, లివర్, కిడ్నీలు మరొకరికి దానం చేసేందుకు వారు ముందుకు వచ్చారు. దానం ఇస్తున్న అవయవాలను ఎవరికి సరిపోతాయో 23వ తేదీన నిర్ధారించనున్నారు. అనంతరం మురహరి మృతదేహాన్ని 24న స్వగ్రామానికి తీసుకురానున్నట్టు సమాచారం.

మారేడుమిల్లి జలపాతంలో..

ముగ్గురు వైద్య విద్యార్థులు గల్లంతు

జలతరంగిణి జలపాతం

ప్రజాశక్తి - దెందులూరు/ఏలూరు స్పోర్ట్స్

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి మండలం జలతరంగిణి జలపాతం వద్ద ఒక్కసారిగా వరద రావడంతో ముగ్గురు వైద్య విద్యార్థులు గల్లంతయ్యారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరులోని ఆశ్రం మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్న సుమారు 14 మంది విద్యార్థులు ఆదివారం పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు మారేడుమిల్లి వెళ్లారు. వీరు జలతరంగిణి జలపాతం వద్ద ఉండగా భారీ వర్షం కారణంగా ఎగువ నుంచి వరద రావడంతో ఐదుగురు కొట్టుకుపోయారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టగా కాజ్‌వే వద్ద చిక్కుకున్న ఇద్దరిని సురక్షితంగా రక్షించినట్లు మారేడుమిల్లి సిఐ గోపాలకృష్ణ తెలిపారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. గల్లంతైన వారు సిహెచ్.అరదీప్, కె.సౌమ్య, బి.అమృతగా గుర్తించారు. వీరంతా ఆశ్రం మెడికల్ కళాశాలలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరికి సంబంధించిన సమాచారం ఆశ్రం ఆసుపత్రి యాజమాన్యానికి చేరలేదని తెలిసింది. వీరు హాస్టల్ విద్యార్థులు కాదని, అందువల్ల తమకు సమాచారం రాలేదని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. అదనపు ఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక రెస్క్యూ టీమ్ ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. రక్షించిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. రంపచోడవరం ఎంఎల్ఎ శిరీషాదేవి విద్యార్థులను పరామర్శించారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. అల్లూరు జిల్లా కలెక్టర్‌ను ఏలూరు జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి రిసోర్స్‌పర్సన్‌గా స్వామి మాస్టారు


స్వామి మాస్టారు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా స్వామి మాస్టారు ఎంపికయ్యారు. సిఐఇటి, ఎన్‌సిఇఆర్‌టి న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈ కంటెంట్ అభివృద్ధికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులను స్టేట్ రిసోర్స్ గ్రూప్ మెంబర్స్‌గా ఎంపిక చేసి వారికి రెండు బ్యాచ్‌లలో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా రెండవ ఫేజ్‌లో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల ఆన్‌లైన్ శిక్షణలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసిన 20 మంది ఎస్‌ఆర్‌జిల్లో మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలి ఉపాధ్యాయుడు బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర తెలిపారు. ఇంతకుముందు ఈ కంటెంట్‌లో భాగంగా మూడవ తరగతి గణితానికి సంబంధించి రూపొందించిన వీడియోలు ఎపిఇ పాఠశాల యాప్, ప్రభుత్వ యూట్యూబ్ ఛానల్‌లో పొందుపరిచినట్లు స్వామి మాస్టారు వివరించారు. ఈ శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకొని చక్కని ఈ కంటెంట్ రూపకల్పనకు కృషిచేస్తానని స్వామి మాస్టారు తెలిపారు. ఇంత చక్కని దేశవ్యాప్త శిక్షణకు ఎంపికైన స్వామి మాస్టారును ఎంఇఒ-2 వేంద్ర వెంకటేశ్వరరావు, పలు ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న ఇసుక కొరత

పనులు లేక భవన నిర్మాణ కార్మికుల ఇక్కట్లు

నేటికీ అందుబాటులో లేని ఆన్‌లైన్ బుకింగ్

ప్రజాశక్తి - పాలకొల్లు

గత నెలరోజులుగా ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది. కనీసం బ్లాక్‌లో కూడా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో ఇటు నిర్మాణదారులు, అటు ఇసుకపై ఆధారపడిన భవన నిర్మాణ కార్మికులతో పాటు పలు రంగాల కార్మికులు పని లేక ఇక్కట్లు పడుతున్నారు. సాధారణంగా జులై నుంచి నవంబర్ వరకు గోదావరిలో ఇసుక దొరకని పరిస్థితి ఉంటుంది. అందుకే ముందుగా ప్రభుత్వంతో పాటు కొందరు ఇసుక నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్లో అమ్ముతారు. ప్రభుత్వం ఇసుకను స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచుతారు. ఈసారి ప్రభుత్వం మారడం, ఇసుకపై సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. ఇసుక ప్రభుత్వపరంగా ఉచితం అయినా, వేలు పెట్టి కొందామన్నా దొరకని పరిస్థితి నెలకొంది. గత నెలలో గోదావరికి వరదలు రాక ముందు 3 యూనిట్‌ల ఇసుక లారీ ధర పాలకొల్లులో రూ.10,500 నుంచి రూ.12 వేల వరకూ ఉంది. 5 టన్నుల ఇసుక ధర రూ.18 వేల నుంచి రూ.22 వేలకు పెరిగింది. ప్రస్తుతం రూ.25 వేలు అయినా కొందామన్నా ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో జరుపుతున్న వీడియో సమావేశాల్లో ఇసుక సరఫరా సజావుగా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. అయితే ఇసుక లభ్యం కాక జిల్లాలో వందలాది లారీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఖాళీగా ఉంటున్నాయి.

కనుమరుగైన గోదావరి చెంతన విరివిగా దొరికే ఇసుక(ఫైల్‌ఫోటో)

తొలిరోజు నుంచి బుకింగ్ నిల్..

ఇదిలా ఉండగా తొలిరోజు నుంచి సామాన్య ప్రజలకు ఇసుక బుకింగ్ ఆన్‌లైన్‌లో అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే తొలిరోజు పాలకొల్లు నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా ఇసుక బుక్ అయినట్లు సమాచారం లేదు. దీనిపై నియోజకవర్గంలోని ఒక తహశీల్దార్‌ను వివరణ కోరగా దీనిపై 2 రోజుల్లో సరైన వివరాలు లభ్యం అవుతాయని చెప్పారు.

నేడు, రేపు క్రీడా పోటీలకు ఎంపికలు

తణుకు : పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తణుకు నియోజకవర్గ ఎంపికలు ఈనెల 23వ తేదీన అథ్లెటిక్స్, చెస్, బాడ్మింటన్, 24వ తేదీన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగ బాలుర ఉన్నత పాఠశాల తణుకులో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కో ఆర్డినేటర్ సంకు సూర్యనారాయణ తెలిపారు. ఈ ఎంపికలకు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాలలోని విజేతలు పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 9989363978 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఏ పితాని ప్రశంసలు

పెనుమంట్ర : రాష్ట్రంలోనే ప్రత్యేక కలిగిన, పవిత్ర పుణ్యక్షేత్రమైన నత్తా రామేశ్వరంలోని దేవాలయాన్ని దాతల సహకారంతో చక్కగా అభివృద్ధి చేయడం అభినందనీయమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ అన్నారు. స్థానిక మండలంలోని నత్తారామేశ్వరం గ్రామ రామేశ్వరస్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఎంఎల్ఏకు ఘన స్వాగతం పలికారు. పూర్ణకుంభం, మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ దంపతులకు ఘనంగా స్వాగతించారు. సుమారు రూ.10 లక్షలతో శ్రీరామేశ్వర స్వామి రాజగోపురానికి రంగులు వేయించిన దాత తాతకుంట్ల ఏలేశ్వరరావు దంపతులను ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు సన్మాన శాలువాతో సత్కరించారు. స్వామివారిపై భక్తితో దాతలు ముందుకు వచ్చి అభివృద్ధి చేయడం వారి దాన గుణానికి నిదర్శనమని అన్నారు. ఎంపిటిసి టిఎస్ రెడ్డి, మాజీ సర్పంచి కర్రి సుబ్బారెడ్డి, కొక్కిరాల సత్యనారాయణ, మాజీ ఎఎంసి చైర్మన్ గొల్లపల్లి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడం దారుణం

దళిత సంఘం నాయకులు మధు, చంటి

ఆచంట : ఏలూరుపాడులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఫ్లెక్సీని ఉండి ఎంఎల్ఏ రఘురామకృష్ణరాజు తొలగించడం రాజ్యాంగాన్ని అవమానపరచడమేనని దళిత సంఘం నాయకులు బీర మధు, మట్ట చంటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇరువురు విలేకరులతో మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నికైన ఎంఎల్ఏ ఇలా ప్రవర్తించడం దారుణమని వాపోయారు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆయన వ్యవహార శైలి మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. కాగా ఆదివారం ఏలూరుపాడు దళితపేటలో పోలీసులతో లాఠీఛార్జీ చేయడం దారుణమన్నారు. తప్పు చేసిన వారిని వదిలేసి అమాయక దళితులను దొరికిన వారిని దొరికినట్లు లాఠీఛార్జీ చేయడం హేయమైన చర్య అన్నారు. తక్షణమే రఘురామకృష్ణరాజు దళితులకు క్షమాపణ చెప్పాలన్నారు. దళిత నాయకులు కుసుమ సమ్యూల్, బద్దె ఇజ్రాయేలు ప్రసాద్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

తణుకు : బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించి ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న ఉండి ఎంఎల్ఏ రఘురామకృష్ణరాజుని, కాకినాడలో దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావుపై బూతులు తిట్టి దౌర్జన్యానికి పాల్పడ్డ రూరల్ ఎంఎల్ఏ పంతం నానాజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక న్యాయ పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. వారిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్‌తో ఆదివారం తణుకు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, నరేంద్ర సెంటర్లలో రాస్తారోకో, ర్యాలీ సామాజిక న్యాయపోరాట సమితి, జైభీమ్, సమత యువజన సంఘాలు, తణుకు అడ్వకేట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీకుమార్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు గొల్లపల్లి అంబేద్కర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

'లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలి'

తాడేపల్లిగూడెం: కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను, సౌకర్యాలను కేంద్రంలోని మోడీ-షాలు హరిస్తున్నారని ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు(యువి) అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం జరిగిన ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజకీయ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న పెట్టుబడిదారీ అనుకూల విధానాల వల్ల కార్మిక చట్టాలు అమలు జరగటం లేదని విమర్శించారు. అదేవిధంగా కార్మికరంగంలో పనిచేసే కార్యకర్తలు నీతి, నిజాయితీ, నిబద్ధత, అంకిత భావంతో కార్మికవర్గంలో మమేకమై ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఉపాధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్, కార్యదర్శులు మామిడి దాన వరప్రసాద్ పాల్గొన్నారు.

పలుచోట్ల అన్న సమారాధన

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని పెద్ద సాయి బాబా గుడి రోడ్‌లో శ్రీసాయి గణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. అనంతరం అన్నసమారాధనకు రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. వారితో పాటు కట్టా సత్యనారాయణ, దేవర శ్రీనివాస్, చరణం శ్రీను, కర్ణం శ్రీను, నడిపూడి చిన్న నాగేశ్వరావు, కర్ర ప్రసాద్, గ్రంధి రఘు, మధు, దేవరపల్లి సత్తిబాబు పాల్గొన్నారు. పట్టణంలోని పలుచోట్ల భారీ అన్నసమారాధన నిర్వహించారు.

గణపవరం : వినాయక చవితి ముగింపు సందర్భంగా సరిపల్లి సిద్ధి వినాయక ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5 వేల మంది ప్రజలు అన్నసమారాధనలో పాల్గొన్నారని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

ఆకివీడు : పచ్చదనం, పరిశుభ్రతని ప్రతి ఒక్కరూ పాటించాలని ముస్కాన్ సభ్యుడు(వీధి బాలలు, బిచ్చగాళ్ల స్కూల్‌కి పంపడం, అందరూ చదవాలి-అందరూ ఎదగాలి) అజ్జమూరు గరువు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌విఎస్.నారాయణ వివరించారు. స్థానిక 5వ వార్డు ఎస్‌జెఎస్‌జెడ్ ఎంపీ పాఠశాల సమీపంలో రోడ్ల మీద వున్న చెత్తను ఆయన స్థానికులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడి చెత్త-తడి చెత్త కోసం రెండు వేర్వేరు చెత్తబుట్టలు ఉపయోగించాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన నిషేధించాలని పిలుపునిచ్చారు. ఇంటి చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వెదజల్లకూడదని, నగర పంచాయతీ వాహనాల్లో వేయాలన్నారు. మరిన్ని సూచనలు ఆయన వివరించారు. మనం ఆరోగ్యంగా ఉండి దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలని చెప్పారు.

భీమవరం టౌన్ : స్వచ్ఛత జీవన గమనానికి భద్రత అని, స్వచ్ఛత పాటించడం మన బాధ్యత అని భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ సుపరింటెండెంట్ చక్రవర్తి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం రైల్వే శాఖల అధ్వర్యంలో చీపురు పట్టుకుని ప్లాట్‌ఫారమ్స్ శుభ్రపరిచే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎం.చక్రవర్తి మాట్లాడుతూ ప్రధాని మోడీ మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛతా హి సేవా, స్వచ్ఛ భారత్, స్వచ్ఛత సర్వేక్షన్ అనే నినాదంతో పరిశుభ్రతపై ప్రవేశపెట్టిన పథకాలు దేశ వ్యాప్తంగా ప్రజా చైతన్యానికి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. రైల్వే రాంబాబు, ఇన్‌స్పెక్టర్ ఆర్తి, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సరిపిడకల రామారావు, కార్యదర్శి జానపాటి మధు సుధన్ రావు పాల్గొన్నారు.

ఆరోగ్యం, ఆనందం డబ్బుతో కొనలేనివి

పెనుమంట్ర : ఆరోగ్యం, ఆనందం రెండూ డబ్బుతో కొనలేనివని, ఆరోగ్యంతో ఆనందంగా ఉండాలని సీనియర్ పిరమిడ్ ఉపాధ్యాయులు, హిప్నాసిస్ట్ ఉమాచంద్ అన్నారు. మండల కేంద్రం పెనుమంట్ర గ్రామంలో భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, సాయిగీత నిర్మించిన జగద్గురు డాక్టర్ బ్రహ్మర్షి పితామహ పత్రిజీ పిరమిడ్ ధ్యానమందిరం వద్ద హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్, ప్రముఖ హిప్నాటిస్ట్, సైకిక్ రీడర్ ఉమాచంద్ విశేష జ్ఞానబోధతో ధ్యానశిక్షణా కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. జిల్లా కో ఆర్డినేటర్ కెవిడి.ప్రసాద్, సుబ్బారాయుడు, శ్రీనివాస్ మాస్టర్, మధు పాల్గొన్నారు.

నాణేలు, స్టాంపుల ప్రదర్శన

పాలకొల్లు : యూత్ హాస్టల్స్ ఆఫ్ ఇండియా, పాలకొల్లు లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే స్టాంపులు, నాణేల ప్రదర్శనను మాజీ ఎంఎల్ఏ డాక్టర్ బాబ్జి ఆదివారం ప్రారంభించారు. పాలకొల్లు లయన్స్ ఆడిటోరియంలో జరిగిన సభలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు చూడడం వల్ల వివిధ దేశాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు అవగాహన చేసుకోవచ్చని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులకు ఇటువంటి ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ యూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. 220 దేశాలకు సంబంధించిన స్టాంపులు, నాణెములు ప్రదర్శించారు. పాలకొల్లు యూనిట్ ఛైర్మన్ కారుమూరి సూర్యనారాయణ, కార్యదర్శి కెజి.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గత ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో విమర్శించిన ఎంఎల్ఏలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఐదేళ్లలో వైసిపి చేసిన అభివృద్ధి శూన్యమని, సంక్షేమ అప్పుల రాజ్యం కొనసాగిందని, ఆ రాజ్యానికి అప్పుల మహారాజుగా జగన్మోహన్ రెడ్డి నిలిచిపోయారని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం మండలంలోని నత్తారామేశ్వరం గ్రామంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిపై ఘాటైన విమర్శలు చేశారు. సామాజిక పెన్షన్ల తప్ప, ఉద్యోగులకి ఒకటో తారీఖున జీతాలు ఇవ్వలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 100 రోజుల్లో డిఎస్‌సి ద్వారా 16,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఒకటో తారీకునే వందశాతం పంపిణీ జరిగిందని, బుడమేరు ముంపు వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో చంద్రబాబు నిద్రాహారాలు మాని సేవలందించారని చెప్పారు. సర్పంచి వెలగల ధర్మారెడ్డి, ఎంపిటిసి టిఎం రెడ్డి, మండల తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ పి.పద్మజ, పార్టీ మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచి కర్రి సుబ్బారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు తమలంపూడి శ్రీరామ దుర్గారెడ్డి, ఆకివీడు శ్రీహరి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకున్న కూటమి ప్రభుత్వమని, సంక్షోభంలోనూ సంక్షేమం అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కే సాధ్యమని ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 12వ వార్డు చిన్న బలుసులమ్మ వారి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టిడిపి నాయకులు వలవల బాబ్జి, జనసేన నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, వర్తనపల్లి కాశీ, పట్నాల రాంపండు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆచంట : గత ప్రభుత్వ హయాంలో ఎవరికైనా అన్యాయం జరిగితే చెప్పుకునే పరిస్థితి ఉండేది కాదని, నేడు ఇటువంటి పరిస్థితులు లేకుండా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆచంట వేమవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రజావేదికపై ఇది మా మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు. అనంతరం సిఎం సహాయ నిధికి గ్రామస్తులు రూ.1,82,000 చెక్కును ఎంఎల్ఏకు అందించారు.

మొగల్తూరు : వంద రోజుల పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన చేసిందని ఎంఎల్ఏ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని పేరుపాలెం నార్త్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కొల్లాటి గోపీకృష్ణ, వలవల నాని పాల్గొన్నారు.

పోలీసుల లాఠీఛార్జీ అవాస్తవం : ఎస్పీ

కాళ్ల : మండలంలోని ఏలూరుపాడులో పోలీసులు లాఠీఛార్జీ చేశారంటూ జిల్లావ్యాప్తంగా సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్న వీడియో అవాస్తవమని జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి ఆదివారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. వీడియోలను ఇతర సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినా, షేర్ చేసిన వారిపై చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇటువంటి వీడియోలను నమ్మి ఎవరూ మోసపోవద్దని, తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

'ఫ్లెక్సీ తొలగింపును రాజకీయం చేయడం సరికాదు'

ఉండి : బ్యానర్ తొలగింపును రాజకీయం చేయడం సరికాదని ఉండి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని మొట్టమొదటిగా గళం విప్పి అంబేద్కర్ రాజ్యాంగం కోసం పాటుపడిన వ్యక్తి రఘురామకృష్ణరాజు అని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన వరద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - గణపవరం

వాహనాన్ని ప్రారంభిస్తున్న బలరాం, నేతలు

విజయవాడ వరద బాధితులకు సిపిఎం ఆధ్వర్యంలో గణపవరం, పిప్పర గ్రామాల్లో బట్టల షాపు యజమానులు, వ్యకుల నుంచి సేకరించిన చీరలు, దుప్పట్లు, పిల్లలకు డ్రస్‌లు, వంటపాత్రలను సేకరించారు. ఆదివారం వాటిని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ద్వారా రెండు వాహనాలలో విజయవాడ పంపినట్లు పార్టీ సీనియర్ నాయకులు పి.గోవింద్, డి.రామలింగరాజు తెలిపారు. తాము కోరిన వెంటనే షాపు యజమానులు సహకరించి వరద బాధితులకు బట్టలు అందజేసినందుకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుత్తులశ్రీను, మాదాసి అర్జునుడు, గొల్లపల్లి పోతురాజు, కె.త్రినాథ్ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహం

తాడేపల్లిగూడెం : ఇంటర్, పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తమ సొసైటీ ద్వారా నగదు ప్రోత్సాహం ప్రదానం చేసి, మరింతగా విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నామని ది సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ పెన్మత్స రంగనాథరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌టిసి డిపో ఎదురుగా ఉన్న సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ బ్రాంచి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి తమ సంస్థ కార్యకలాపాలు, సంక్షేమ కార్యక్రమాలు వివరించి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, ప్రతిభా సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. జీవిత బీమా విశ్రాంత ఉద్యోగుల జాతీయ నాయకులు గరికపాటి బాపయ్యశర్మ మాట్లాడుతూ సమాజంలో విద్య, వైద్యం, అతి ముఖ్యమైన ఖరీదైన అవసరాలని, వాటిని తీర్చే ప్రయత్నం చేస్తున్న ఈ సొసైటీని ఆయన అభినందించారు. పురస్కార గ్రహీతలను బ్రాంచి మేనేజర్ లోవరాజు, దేవి అభినందించారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటికే పరిమితమై అనారోగ్య వృద్ధులకు సంచార శకటం ద్వారా ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు వైద్యమందించారు. ఆదివారం డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలుమహేంద్రలు తణుకు, పైడిపర్రు, పాలంగి ప్రాంతాల్లో పర్యటించి సుమారు 8 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో దాట్ల బాబు మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు

బాబు(ఫైల్ ఫోటో)

పాలకోడేరు గ్రామానికి చెందిన దాట్ల రామకృష్ణమరాజు (దాట్ల బాబు)(58) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. పాలకోడేరు సహకారా సంఘం డైరెక్టర్‌గా, పాలకోడేరు పంచాయతీ పాలకవర్గం సభ్యులుగా దాట్ల బాబు గతంలో పనిచేసి అటు రైతులకు, ఇటు గ్రామస్తులకు అనేక సేవలు అందించారు. ప్రస్తుతం గ్రామ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఏ పార్టీకి చెందిన వ్యక్తి కానప్పటికీ రాజకీయాలకతీతంగా పెద్ద మనిషి తత్వంతో ముందుకు సాగుతున్నారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులకు ఏ అవసరమొచ్చినా వారి వారి అవసరలా మేరకు అందరికీ సహాయ సహకారాలు అందిస్తున్నారు. వివిధ స్వచ్ఛంద సంఘాలతో పాటు అనారోగ్యాలకు గురైన వ్యక్తులకు, గ్రామస్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ఆర్థిక సహకారం అందిస్తూ దాతగా మంచి గుర్తింపు పొందారు. దాట్ల బాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 5 నెలల క్రితం దాట్ల బాబు తల్లి మృతి చెందారు. కొద్దినెలల వ్యవధిలో ఒకే కుటుంబంలో తల్లీకొడుకులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పలువురు ప్రముఖుల నివాళి

గ్రామ సర్పంచి ఇంజేటి మరియమ్మ, గ్రామ పెద్దలు కునదరాజు మురళీకృష్ణంరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గాదిరాజు రాంబాబు, గొట్టుముక్కల రామలింగరాజు(మాస్టారు)తో పాటు చుట్టుపక్కల ప్రజలు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు దాట్ల బాబు భౌతికాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే రైతు సంఘం నాయకులు బి.బలరాం దాట్ల బాబు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దాట్ల బాబు మృతి చెందడం బాధాకరమని, ఆయన మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

సిపిఎం మండల కమిటీ నివాళులు

దాట్ల బాబు మృతి పట్ల సిపిఎం మండల కమిటీ నివాళులు అర్పించింది. మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ, కమిటీ సభ్యులు దున్న మరియమ్మ, పాల వెంకటస్వామి దాట్ల బాబు భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. దాట్ల బాబు మృతిపట్ల సంతాపం తెలిపి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రపంచ కవుల్లో గర్వించదగ్గ రచయిత గురజాడ

భీమవరం టౌన్ : ప్రపంచ కవులలో గర్వించదగ్గ ఆధునిక కవి గురజాడ అప్పారావు అని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా వర్కింగ్ కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. శనివారం గురజాడ అప్పారావు 162వ జయంతిని స్థానిక ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు ఎవివి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ గురజాడ బాల్యవివాహాల దృష్టాంతంపై ఎదిరించి పోరాడారని, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ కావ్య ఖండిక గురజాడను సంఘసంస్కర్తగా తీర్చి దిద్దిందన్నారు. ఆనాటి దురాగతాలపై వేశ్య వృత్తులను నిరసిస్తూ రాసిన కన్యాశుల్కం శతా ధీకా సంవత్సరాలను పూర్తి చేసుకోవడం తెలుగు సాహితీ వికాసానికి ఆయన కృషి మరువరానిదన్నారు. దిద్దుబాటు కథానిక ఆనాటి సమాజంలో రుగ్మతలను దిద్దుబాటుకు తోడ్పడిందన్నారు. దేశమును ప్రేమించుమన్నా, దేశమంటే మట్టి కాదు, దేశమంటే మనుషులోయ్ గీతాలు జనంలో దేశభక్తి ప్రదర్శింపబడిందన్నారు. హెచ్ఎం ఎవివి.సత్యనారాయణ కళా రంజని అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్, అరసం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు, కళాకారులు శ్రీనివాస్ రావు, చప్పిడి శ్రీనివాస్ మాట్లాడుతూ గురజాడ ప్రపంచ కవులలో ఒక్కడిగా లెక్కించదగ్గ మహాకవి అని కొనియాడారు. ముత్యాల సరాలు తన రచనలు ముత్యాలు లాంటి హితోక్తులను అందించిందన్నారు. మహాకవి గురజాడని, ఆయన చేసిన రచనలు విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచనను పోటీల్లో గెలుపొందిన గీత, లాస్య, భార్గవి ముగ్గురికి, పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల పరిశీలన

నరసాపురం: మండలంలోని పలు వార్డుల పరిధిలోని ప్రధాన డ్రెయినేజీలను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా ప్రతిరోజు డ్రెయినేజీ శుభ్రం చేసే పనులను చేపట్టామని చెప్పారు. మురుగు నీరు నిల్వ లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించారు. మాజీ వైస్ చైర్‌పర్సన్ పొన్నాల నాగబాబు, మాజీ కౌన్సిల్ తిరుమాని శశిదేవి పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ వద్ద నిరసన

పాలకొల్లు : ఎన్నికల ముందు టిడిపి హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఒక్క పెన్షన్లు తప్ప మరే ఇతర హామీలు అమలు చేయనందున భీమవరం కలెక్టరేట్ వద్ద ఈనెల 25 బుధవారం ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరి కుమార్ రాజు అన్నారు. ఆదివారం పాలకొల్లు కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ నేతలతో సమావేశం అయ్యారు. నిరసనలో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ఐరన్ వర్కర్లు, వ్యాపారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెనుగొండ

ఐరన్‌వర్కర్ల అసోసియేషన్ అభివృద్ధికి కావలసిన సహాయ సహకారాలకు కృషి చేస్తానని ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆచంట ఎంఎల్ఏ పితాని సత్యనారాయణని కొమ్ముచిక్కాల ఆయన స్వగృహంలో అసోషియేషన్ అధ్యక్షుడు కుడిపూడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సంఘం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎంఎల్ఏ హామీ ఇచ్చారు.

రేపు లేస్‌పార్క్ ఎన్నిక

నరసాపురం : మండలంలోని సీతారాంపురం లేస్‌పార్కు సొసైటీ ఎన్నికలు ఈనెల 24న జరగనున్నాయి. ఇప్పటికే పార్కు పరిధిలో ఉన్న నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, వీరవాసరం, మొగల్తూరు మండలాలకు చెందిన 51 సొసైటీలకు ఎన్నికలు పూర్తయ్యాయి. గతనెలలో 23న పార్కులో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే కొన్ని సొసైటీల అధ్యక్షుల ఎన్నికలు పూర్తికాకపోవడంతో పార్కు ఎన్నికను వాయిదా వేశారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన ఉండ్రాజవరం మండలం, మోర్త గ్రామం, డో.నెం.8-60/3 గ్రామ కాపురస్తులు **కొడాటి సత్యనారాయణ గారి భార్య వెంకటదుర్గ** గారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.., నా క్లయింటు దిగువ షెడ్యూలు దాఖలు ఆస్థిని మొగళ్ళపు సూరన్న గారి కుమారుడు మొగళ్ళపు దశరథ రామయ్య ద్వారా డాక్యుమెంటు నెం.8476/2022, తణుకు ఎస్.ఆర్.ఓ.లో రిజిష్టర్ కాబడిన క్రయ దస్తావేజు రిత్యా పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్న ఆస్థిని గతంలో తేది 19-12-2011న కోమటి శివ నాగేశ్వరరావు గారు, చిటికిన హరినాథ్ గారికి డాక్యుమెంటు నెం.5719/2011 ద్వారా క్రయపరచినారు. సదరు దస్తావేజును తేదీ ది.17-04-2021న కోమటి శివ నాగేశ్వరరావు గారు చిటికిన హరినాథ్ గారికి 2432/2021 కాన్సిలేషన్ డీడ్ ద్వారా 5719/2011, తణుకు ఎస్.ఆర్.ఓ.లో జరిగిన క్రయ దస్తావేజును రద్దు పరచడమైనది. సదరాస్థికి చెందిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.5719/2011 (తణుకు ఎస్.ఆర్.ఓ) మరియు 2432/2021 (తణుకు ఎస్.ఆర్.ఓ) పోయినదని దొరికియుండలేదని చెప్పి నా క్లయింటును నమ్మించి విక్రయించినందున సదరాస్థిపై, పోయిన దస్తావేజులకు ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు వగైరాలు ఉన్నచో 7 రోజులలోపు వ్రాత పూర్వకంగా ఈ క్రింది అడ్రసుకు తెలియజేయవలెనని, గడువు లోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్థిగా భావించి నా క్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పొంది సదరు ఆస్థిని తనఖాగా ఉంచి ఋణము పొందుదురు అని మరియు గడువు అనంతరము వచ్చు ఆక్షేపణలు వగైరాలు నా క్లయింటు హక్కులను బైండు చేయజాలవు.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా, భీమవరం రిజిస్ట్రారు వారి పరిధిలోని, తణుకు సబ్‌డి, ఉండ్రాజవరం మండలం, మోర్త గ్రామ పంచాయితీ ఏరియాలోని మోర్త గ్రామం తాలూకు రి.స.నెం.139/1ఎ దాఖలా డో.నెం.8-74రు గల ఇంటికి సమీపము గల చ॥గ॥81.25లు ఆర్.సి.సి. బిల్డింగుకు కొలతలు, హద్దులు:
తూర్పు: అ॥29-00లుకు చిటికిన కృష్ణమూర్తి గారి తాలూకు బిల్డింగు.
పడమర: అ॥36-00లుకు చిటికిన నాగ మునేంద్రరావు గారి తాలూకు స్థలము. **ఉత్తరం:** అ॥21-00లుకు రాచమళ్ళ వెంకట్రావు గారి తాలూకు గోడ. **దక్షిణం:** అ॥24-00లుకు మోర్త టు వెలగదుర్రు రోడ్డు.

పమ్మి వీరభద్రుడు, అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా. సెల్: 77023 11197

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

I.A.No.536/2024, I.A.No.242/2023, O.S.No.213/2015

Between:
Sri Gamidi Satyanarayana
...Petitioner /Plaintiff
AND
Sri Naidana Janardhana Rao (Died) and 6 Others
...Respondents /Defendants
TO:
R-4: Sri Naidana Srinivasa Rao, S/o. Late Janardhana Rao, Bapuji Nagar, Sivaram Appireddi Hills, Khairatabad, Hyderabad, Telangana State, H.J.C.M.C.
R-6: Sri Muchi Varalakshmi, W/o. Nageswara Rao, Ravikalapadu, Pithapuram, (E.G.District), P.P.J.C.J.C.
R-7: Sri Muchi Mani Ratnam, W/o. Venkata Rao, Vijayawada, Krishna District, V.P.J.C.J.C.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయిన కారణంగా సదరు దావాలో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లు ప్రపోజుడు పార్టీగా చేర్చే నిమిత్తం ఐ.ఎ.నెం.536/2024 ఇన్ ఐ.ఎ.నెం. 242/2023 పిటీషనులో శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషనులో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లుకు కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ కావాలని తీసుకొనకుండా నిరాకరించుచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు మేరకు మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీ హాజరుకై ఈ పిటీషన్ వాయిదా **ది.15-10-2024 సం॥తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవచ్చును.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

కోడూరి వెంకటేశ్వరరావు
పాలకొల్లు, అడ్వకేట్, పాలకొల్లు.
17-9-24. సెల్: 94417 50937

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

I.A.No.537/2024, I.A.No.243/2023, O.S.No.213/2015

Between:
Sri Gamidi Satyanarayana
...Petitioner /Plaintiff
AND
Sri Naidana Janardhana Rao (Died) and 6 Others
...Respondents /Defendants
TO:
R-4: Sri Naidana Srinivasa Rao, S/o. Late Janardhana Rao, Bapuji Nagar, Sivaram Appireddi Hills, Khairatabad, Hyderabad, Telangana State, H.J.C.M.C.
R-6: Sri Muchi Varalakshmi, W/o. Nageswara Rao, Ravikalapadu, Pithapuram, (E.G.District), P.P.J.C.J.C.
R-7: Sri Muchi Mani Ratnam, W/o. Venkata Rao, Vijayawada, Krishna District, V.P.J.C.J.C.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయిన కారణంగా సదరు దావాలో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లు ప్రపోజుడు పార్టీగా చేర్చే నిమిత్తం ఐ.ఎ.నెం.537/2024 ఇన్ ఐ.ఎ.నెం. 243/2023 పిటీషనులో శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషనులో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లుకు కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ కావాలని తీసుకొనకుండా నిరాకరించుచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు మేరకు మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీ హాజరుకై ఈ పిటీషన్ వాయిదా **ది.15-10-2024 సం॥తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవచ్చును.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

కోడూరి వెంకటేశ్వరరావు
పాలకొల్లు, అడ్వకేట్, పాలకొల్లు.
17-9-24. సెల్: 94417 50937

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో

I.A.No.535/2024, I.A.No.241/2023, O.S.No.213/2015

Between:
Sri Gamidi Satyanarayana
...Petitioner /Plaintiff
AND
Sri Naidana Janardhana Rao (Died) and 6 Others
...Respondents /Defendants
TO:
R-4: Sri Naidana Srinivasa Rao, S/o. Late Janardhana Rao, Bapuji Nagar, Sivaram Appireddi Hills, Khairatabad, Hyderabad, Telangana State, H.J.C.M.C.
R-6: Sri Muchi Varalakshmi, W/o. Nageswara Rao, Ravikalapadu, Pithapuram, (E.G.District), P.P.J.C.J.C.
R-7: Sri Muchi Mani Ratnam, W/o. Venkata Rao, Vijayawada, Krishna District, V.P.J.C.J.C.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది చనిపోయిన కారణంగా సదరు దావాలో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లు ప్రపోజుడు పార్టీగా చేర్చే నిమిత్తం ఐ.ఎ.నెం.535/2024 ఇన్ ఐ.ఎ.నెం. 241/2023 పిటీషనులో శ్రీ కోర్టు వారు పై నెంబరు పిటీషనులో ఆర్-4, ఆర్-6 మరియు ఆర్-7 రెస్పాండెంట్లుకు కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ కావాలని తీసుకొనకుండా నిరాకరించుచున్నందున శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు మేరకు మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మీ హాజరుకై ఈ పిటీషన్ వాయిదా **ది.15-10-2024 సం॥తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవచ్చును.** లేని ఎడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.

కోడూరి వెంకటేశ్వరరావు
పాలకొల్లు, అడ్వకేట్, పాలకొల్లు.
17-9-24. సెల్: 94417 50937